## బాచుపల్లి, బౌరంపేట్‌లో వైభవంగా బోనాలు

**• పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, తదితరులు**

దుండిగల్, ఆగస్టు 11 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఆదివారం బోనాల పండుగ వైభవంగా జరిగింది. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ బంగారుమైసమ్మ ఆలయం, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి నల్లపోచమ్మ ఆలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగగా పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన బోనాలు, తొట్టెల ఊరేగింపు ఘనంగా కొనసాగింది. డప్పు, వాయిద్యాల నడుమ నెత్తిన బోనాలతో శివసత్తులు నృత్యాలు చేయడం భక్తులను అకట్టుకుంది. మరో వైపు పోతరాజుల నృత్యాలు అలరించాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.

**ప్రముఖుల పూజలు..**

బౌరంపేట్‌లోని బంగారు మైసమ్మ తల్లిని ఐశ్వర్యాంబిక తపోవనం త్రిశక్తి పీఠానికి చెందిన శ్రీశక్త్యానందగిరి స్వామి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్‌ఎస్ నేత, మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బాచుపల్లిలోని నల్లపోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, తదితరులు

అదే విధంగా బాచుపల్లిలోని నల్లపోచమ్మ ఆలయాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

బంగారు మైసమ్మ ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, శివసత్తులు

బంగారుమైసమ్మ ఆలయ ప్రాంగణంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

### ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి దర్శనాలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను పరిగణనలోని తీసుకోవాలని కోరారు. ఇందుకు ఏపీ సీఎం చంద్రబాబు సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు.

### కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 23, వంకాయ 45, బెండకాయ 28, పచ్చిమిర్చి 60, బజ్జి మిర్చి 65, కాకరకాయ 32, బీరకాయ 35, క్యాబేజి 25, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 28, చిక్కుడు 65, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 50, ఆలుగడ్డ 37, కీర 31, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 50, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 40, చింతకాయ, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 55, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చిబఠాని, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 280, చింతపండు 140, కరివేపాకు 80 రూపాయలుగా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## మన సంప్రదాయాలను కాపాడుకోవాలి

**• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

వివేక్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11 : గ్రామ దేవతల దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకాంక్షించారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బాబురావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. తెలంగాణలో ఆషాఢం, శ్రావణ మాసాల్లో గ్రామ దేవతలను పూజించడం ఆనవాయితీ అని ఆయన పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లలితా, వెంకటేశ్‌చౌదరి, అనిల్‌కుమార్, శోభరాణి, రమేశ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి : సీఐ

స్థానికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

జగద్గిరిగుట్ట, ఆగస్టు 11 : ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణం సజావుగా సాగించాలని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. జగద్గిరిగుట్ట – ఆల్విన్‌కాలనీ రోడ్డులో ఆదివారం స్థానికులు, వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై సీఐ అవగాహన కల్పించారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. షాపుల ఎదుట రోడ్డును ఆక్రమించేలా వాహనాలు నిలుపవద్దని యజ మానులను హెచ్చరించారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలని ఆయన పేర్కొ న్నారు. రోడ్లపై ఎలాంటి విక్రయ వస్తువులు, బోర్డులు పెట్టవద్దన్నారు.కార్యక్రమంలో ఏఎస్‌ఐ క్రిష్టయ్య, సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావు వైద్యశాల ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన 5కే రన్‌లో పాల్గొన్న మెడికల్ డైరెక్టర్ కమలాకర్, సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని రామ్‌దేవ్‌రావు దవాఖాన మెడికల్ డైరెక్టర్ కమలాకర్ అన్నారు. సర్వైకల్ క్యాన్సర్ వాక్సినేషన్‌పై అవగాహనలో భాగంగా ఆదివారం రామ్‌దేవ్ దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌ను దవాఖాన మెడికల్ డైరెక్టర్ కమలాకర్, సీఈవో ఎన్.యోబు, అబ్‌స్ట్రిక్ అండ్ గైనిక్ హెచ్‌వోడీ ఛాయాదేవి, పీ. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాదిలో తమ దవాఖాన ఆధ్వర్యంలో 2,500 మందికి సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ చేసినట్లు తెలిపారు. 9 నుంచి 4 ఏండ్ల చిన్నారులకు సర్వైకల్ వ్యాక్సినేషన్ వేయిస్తే.. వారు జీవితకాలం ఈవ్యాధి బారిన పడరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలంటే.. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. మితాహారంతో పాటు ఆటలు, నడక, యోగా చేయాలని సూచించారు. దవాఖాన యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం

రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ. 50వేల నగదును అందజేస్తున్న కావలి గణేశ్

దుండిగల్,ఆగస్టు 11 : దుండిగల్ తండా–1లో ఇటీవల నిర్మించిన రేణుకా ఎల్లమ్మ సహిత, దుర్గామైసమ్మ ఆలయాభివృద్ధికి సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కావలి గణేశ్ రూ. 50,116 విరాళం అందజేశారు. ఆదివారం జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదు అందజేశారు. గణేశ్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించి, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దొంతి మహేశ్, బాబు, దేవిసింగ్, వెంకటేశ్‌నాయక్, భీంసింగ్, వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం

జగద్గిరిగుట్ట, ఆగస్టు 11 : ఆలయాల్లో జరిగే వేడుకలతో ప్రజల్లో ఐక్యత, సహకారం పెరగాలని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు సూచించారు. జగద్గిరిగుట్ట జగ్గిరినగర్, దేవమ్మబస్తీలోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం చేశారు.

కార్యక్ర మంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు జైహింద్, నాగరాజు, రాజ్ కుమార్, సత్యరా జు, మహేందర్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి స్టేడియంలో హాకీ క్రీడాకారుల సంబురాలు

గచ్చిబౌలి స్టేడియంలో సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ ఇతర ప్రముఖులు, హాకీ క్రీడాకారులు

శేరిలింగంపల్లి, ఆగస్టు 11: ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంతో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం హాకీ క్రీడాకారులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ ఫొటోకు క్షీరాభిషేకం నిర్వహించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంబురాల్లో రాష్ట్ర హాకీ అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్, కార్యదర్శి బీంసింగ్, సభ్యులు సురేందర్ సింగ్, వేణుగోపాల్, హుస్సేన్, రాజశేఖర్‌తో పాటు పలువురు హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు మరువలేనివి..

కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులో మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11: స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల త్యాగాలు మరవలేనివని బాలాజీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.వినోద్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల శుద్ధి మహోద్యమంలో భాగంగా ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శుద్ధి చేసి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వీరుల త్యాగాలను నేటి తరానికి వివరించాలన్నారు. ఈ నెల 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని, స్వాతంత్ర్య వేడుకలను పండుగలా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జీ శ్రీకర్‌రావు, వేణుగోపాల్, సోమశేఖర్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, మురళీకృష్ణ,సూరిబాబు, వెంకటనారాయణ, డి.సుధ, రేణుక, లహరి పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

మేడ్చల్: నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ 16 వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈనెల 9వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం వరకు నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజున శ్రీ పోచమ్మ, శ్రీ భవానీ శంకర స్వామి వారికి అభిషేకం, మండప పూజలు, మహదాశీర్వచనం, సాయిధామం–సాయి దత్త పీఠాధిపతులు శ్రీ స్వామి శ్రీరామానంద ప్రభూ ప్రవచనం, మధ్యాహ్నం హారతి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ, అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, అధ్యక్షుడు హరగోపాల్, ప్రధాన కార్యదర్శి నిరంజన్ బాబు, సభ్యులు వెంకటేశ్వరరావు, రంగారావు, శ్రీనివాస్, రమేశ్‌పాల్గొన్నారు.

## స్కేటింగ్‌లో సత్తా చాటిన బోడుప్పల్ విద్యార్థులు

సత్తా చాటిన కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

బోడుప్పల్, ఆగస్టు11: జాతీయ స్కేటింగ్ క్రీడలో బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఇండియా స్టేట్ క్రీడలు 2024 ఓపెన్ నేషనల్‌లో ఈనెల 9న నిర్వహించిన టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో తెలంగాణ రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ నుంచి బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి పాల్గొని జూనియర్ కేటగిరిలో కాంస్య పతకం, క్యాడెట్ కేటగిరిలో మరో కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

### సౌండ్ తగ్గించమన్నందుకు కుర్చీతో దాడి

శేరిలింగంపల్లి, ఆగస్టు 11 : సౌండ్ తగ్గించాలని కోరినందుకు ఓ వ్యక్తి కుర్చీతో దాడి చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖాజగూడలోని లలిత భ్లూమ్‌ఫీల్డ్ విల్లాస్ గెటెడ్ కమ్యూనిటీస్‌లో విల్లా నంబర్ 16లో సూర్య, విల్లా 6లో రాజేంద్రన్ నివాసం ఉంటున్నారు. అయితే రాజేంద్రన్ నిత్యం భారీ సౌండ్‌తో మ్యూజిక్ వింటుంటాడు. సూర్య కొడుకు చదువుకునేందుకు సౌండ్ ఇబ్బందిగా మారడంతో తండ్రీకొడుకులిద్దరూ రాజేంద్రన్ విల్లాలోకి వెళ్లి ప్రశ్నించారు. దీంతో సూర్య, రాజేంద్రన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. కోపోద్రిక్తుడైన రాజేంద్రన్ నా విల్లాలోకి వచ్చి ఎలా అడుగుతారని కుర్చీతో సూర్యపై దాడి చేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

### ఆదర్శనగర్‌లో ఉచిత వైద్యశిబిరం



జగద్గిరిగుట్ట, ఆగస్టు 11 : ప్రజలకు ఉపయోగపడేలా ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీమని పలువురు పేర్కొన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో ఆదివారం రివైవ్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. స్థానికులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వాధ్యులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### 'సమస్యల పరిష్కారమే ధ్యేయం'

దుండిగల్, ఆగస్టు 11: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌ల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్‌ఆర్)ని ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేఎస్‌ఆర్ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తా

**• శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన శేరిలింగంపల్లి జర్నలిస్టులు

మియాపూర్, ఆగస్టు 11 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జర్నలిస్టుల సొంత ఇంటి కలను నెరవేర్చడా నికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఇప్పటికే కేటాయించిన స్థలంలో ఇండ్ల నిర్మాణానికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చందానగర్‌లోని సర్వే నంబర్ 174 లో జర్నలిస్టులకు ఎకరం స్థలం కేటాయించి ఎన్నికలకు ముందు ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా విలేకరులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాగా తమకు స్థలం కేటాయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు విలేకరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు పైళ్ల విఠల్‌రెడ్డి,టెంజు మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేశ్ సాగర్, ప్రధాన కార్యదర్శి జగన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు అమృత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్, విలేకరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి అత్యవసర వైద్య సేవలకు మంజూరైన రూ. 80 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ ఆదివారం తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో తోడ్పాటునందిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

### రహనుమా సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

భాగ్యనగర్‌కాలనీలో రహనుమా సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, ఆగస్టు 11 : శేరిలింగంపల్లి డివిజన్ భాగ్యనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రహనుమా సెంటర్(నాగరిక వికాస్ కేంద్రం)ను ఆదివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలను అందించడంలో ఈ తరహా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. యువత స్వశక్తితో ముందుకు సాగేందుకు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఇక్బాల్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను బెదిరించే సంస్కృతి మా ఎమ్మెల్యేది కాదు..

**• బీఆర్‌ఎస్ నాయకుడు వెల్ది వెంకటేశ్‌చౌదరి**

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11 : కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అధికారులను బెదిరించే సంస్కృతి లేదని.. బీఆర్‌ఎస్ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెల్ది వెంకటేశ్‌చౌదరి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సమర్థించడం సరికాదని, ప్రజా సమస్యలపై అవగాహన లేని నాయకులు ఇలా మాట్లాడవద్దన్నారు. ప్రజల మద్దతుతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కృష్ణారావు పనితీరు గురించి ప్రజలకు తెలుసునని.. ఓటమిపాలైన నాయకుడికి ప్రజా సమస్యలను పరిష్కరించే విధానం తెలియదన్నారు. ఎన్నికలప్పుడు శేరిలింగంపల్లి నుంచి కూకట్‌పల్లికి వచ్చిన బండి రమేశ్.. ఎన్నికల్లో ఓడిపోగానే ఏంచేయాలో పాలుపోక.. కూకట్‌పల్లిలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అధికారులపై పెత్తనం చెలాయిస్తురని విమర్శించారు. అధికారులను బెదిరిస్తున్న బండి రమేశ్ నీతులు చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. కార్పొరేటర్ ప్రొటోకాల్ గురించి మాట్లాడే రమేశ్..కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలువలేదన్న విషయం మరిచిపోయారని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావును విమర్శించడం మానుకోవాలని, ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలని హితవు పలికారు.

## బాలుడి ఔదార్యం..

**• పోలీస్‌స్టేషన్‌కు సైకిల్‌ను అందజేసిన బాలుడు నిఖిల్**

సీఐ నాగరాజుకు సైకిల్‌ను అందజేస్తున్న బాలుడు నిఖిల్

జవహర్‌నగర్, ఆగస్టు 11: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు పోలీసులు సైకిళ్లపై వీధుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమవుతూ సమస్యలను తెలుసుకుంటూ... పరిష్కారం అయ్యేలా కృషి చేస్తున్నారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోని పోలీసు సిబ్బంది ప్రతి రోజూ కాలనీలల్లో సైకిళ్లపై పెట్రోలింగ్ చేస్తూ కమ్యూనిటీ మీటింగ్‌లు పెడుతున్నారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్ శాలివాహన ఎన్‌క్లేవ్‌లో భాస్కరన్ కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాళ్ల తిరుగున్నది గమనించిన బాలుడు నిఖిల్ మా ఇంట్లో ఉన్న సైకిల్‌ను పోలీసులకు అప్పగిస్తే ప్రజలకు మరింత సేవలు సులభమవుతాయని ఆలోచించాడు. భాస్కరన్ కుమారుడు నిఖిల్ స్థానికంగా 4వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఉన్న సైకిల్‌ను పోలీసులకు అప్పగిస్తే బాగుంటుందని తన తండ్రి భాస్కరన్‌ను అడగ్గా... అతి చిన్నవయస్సులోనే సమాజంపై ఉదారతను చాటుకోవడం గొప్పదని భావించి ఆదివారం జవహర్‌నగర్ సీఐ నాగరాజుకు బాలుడు నిఖిల్ సైకిల్‌ను అందజేశారు. బాలుడు ఉదారతను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామునాయక్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా భాస్కర్ యాదవ్

మేడ్చల్, ఆగస్టు 11 : భారత రాష్ట్ర సమితి మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా భాస్కర్ యాదవ్ నియామ కం అయ్యారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. భాస్కర్ యాదవ్ మేడ్చల్‌లో తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించి నేత. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం అధికారంలోకి రాగానే ఒక మారు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవులను ఇచ్చింది. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ అధిష్ఠానం తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిర్వర్తించడా నికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనను నియమించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌కు, సహకరించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### జంట సర్కిళ్ల కార్యాలయంలో నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 11 : కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్లు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

### సాయి త్రిశక్తి ఆలయంలో శ్రీ చక్ర లక్ష కుంకుమార్చన

కాప్రా, ఆగస్టు 11: ఉప్పల్‌లోని శ్రీ సాయి త్రిశక్తి ఆలయంలో శ్రీ చక్ర లక్ష కుంకుమార్చన వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా త్రిశక్తి పీఠం అధినేత శ్రీ రవీంద్రాచార్యులు,శ్రీ హేమంత్ సాయికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రాహ్మణ సంక్షేమవేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాసులు, మహిళా ఉపాధ్యక్షురాలు పావనీశర్మ,ఉజ్వల,శారద, రమాదేవి, భువనేశ్వరి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నేరెళ్ల మల్లికార్జునరావు, చోడవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.